సాక్షి
జనగామ
శుక్రవారం | 1 | ఆగస్టు | 2025



గమ్యంపై గురితో విజయం

గమ్యంపై గురిపెడితే విజయం సొంతం అవుతుందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. - 8లో▸



వైద్యం కోసం వచ్చి.. - 8లో▸

వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా రైతు మృతి చెందాడని కుటుంబికులు జనగామలోని అజంతా హాస్పిటల్ ఎదుట ఆందోళన చేశారు.

వాతావరణం


గరిష్టం/కనిష్టం 35⁰/25⁰

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా మోస్తరు వర్షం కురుస్తుంది.

ముఖ చిత్రమే ముఖ్యమిక!

నేటి నుంచి ఉపాధ్యాయులకు ఫేషియల్ అటెండెన్స్

- పాఠశాల విద్యాశాఖ యాప్‌లో వివరాలు
- బడికి వచ్చాక.. వెళ్లిపోయే సమయంలో నమోదు
- ఇకపై ఉపాధ్యాయుల సమయపాలనలో పారదర్శకత



జనగామ: ఇక ప్రభుత్వ ఉపాధ్యాయులు హాజరు పట్టికలో సంతకాలు పెట్టే రోజులు పోయినట్లే. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ (ఎఫ్ఆర్ఎస్) విధానం కొనసాగుతుండగా.. నేటి (శుక్రవారం) నుంచి టీచర్లకు వర్తింపజేయనున్నారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయగా.. పాఠశాల విద్యాశాఖ యాప్‌లో ఎఫ్ఆర్ఎస్ సమాచారాన్ని పొందుపర్చారు. బడి సమయం దాటిన తర్వాత ఉపాధ్యాయులు వచ్చి హాజరు పట్టికలో సంతకాలు పెట్టే పరిస్థితి ఇక నుంచి ఉండదు. ముఖ కదలిక ఐరిష్ అటెండెన్స్ ద్వారా టీచర్లు ఎన్ని గంటలకు వచ్చారనే విషయం ఇట్టే తెలిసిపోనుంది. సాయంత్రం బడి ముగిసిన తర్వాత ఇంటికి వెళ్లే సమయంలో ఎఫ్ఆర్ఎస్ హాజరు తప్పనిసరి చేశారు.

నేటి నుంచి అమలు..

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సంబంధించిన ఫేస్ రికగ్నైజేషన్ ఆధారిత హాజరు నేటి(గురువారం) నుంచి ప్రారంభం కానుంది. ఈపద్ధతిని ముందుగా విద్యార్థుల హాజరు కోసం ప్రవేశపెట్టగా, ఇప్పుడు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల్లో 29,300 మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. కొంత కాలంగా విద్యార్థులకు ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా అటెండెన్స్ తీసుకుంటున్నారు. విద్యార్థి ప్రతి రోజు స్కూల్‌కి వచ్చిన తర్వాత వారి ముఖ, ఐరిష్ వివరాల ఆధారంగా యాప్‌లో హాజరు తీసుకుంటున్నారు. ఆవివరాల్ని వెంటనే రాష్ట్ర విద్యాశాఖ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తరగతులు, కాంప్లెక్స్, మండలం, జిల్లా, రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా హాజరు శాతం ఎంత నమోదు అయిందనే సమాచారాన్ని యాప్‌లో చూసుకోవచ్చు. ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా టీచర్లకు ఈ విధానం అమలు చేసేందుకు శ్రీకారం చుట్టగా.. ఇక నుంచి జిల్లాల వారీగా ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో విద్యార్థుల హాజరు పక్కనే టీచర్ల వివరాలు సైతం నమోదు చేయనున్నారు.

పెరగనున్న పర్యవేక్షణ

ప్రభుత్వ ఉపాధ్యాయులకు మొబైల్ ద్వారా ఎఫ్ఆర్ఎస్ హాజరు నిర్ణయం శుభ పరిణామం. గతంలో ఈ విధానాన్ని అమలు చేయాలని విద్యాశాఖ భావించి నప్పటికీ, పలు సాంకేతిక కారణాలతో జాప్యం జరిగింది. ఇదిలా ఉండగా.. సర్కారు బడుల టీచర్లతో పాటు ఇకముందు అన్ని రకాల ప్రభుత్వ ఉద్యోగులకు ఈ విధానం అమలు చేసే యోచనలో ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్లకు ఈవిధానం ద్వారా స్కూల్ సమయానికి టీచర్లు చేరుకునే అవకాశం ఉంది. దీంతో పాటు మరింత పారదర్శకత ఉండేందుకు దోహదపడుతుంది.

హాజరు ఇలా..

ఉపాధ్యాయులు తమ స్మార్ట్‌ఫోన్లలో ఎఫ్ఆర్ఎస్ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకుంటారు. చేతి రాత ద్వారా సంతకం చేసే రోజుల నుంచి డిజిటల్ రూపంలో హాజరు గుర్తింపు జరుగుతుంది. ఎఫ్ఆర్ఎస్ ద్వారా అటెండెన్స్‌తో ఉపాధ్యాయులు సకాలంలో స్కూల్‌కు హాజరు కావడంతో విద్యాబోధనలతో తలెత్తే ఇబ్బందులకు చెక్ పెట్టవచ్చు.

రోజులో ఒక పూట గైర్హాజరైన ప్పటికీ, 100 శాతం అటెండెన్స్ వేసుకునే పరిస్థితులు ఇక నుంచి ఉండవు. ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ సిస్టంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నం కాకుండా, ఎప్పటికప్పుడు పర్యక్షించాల్సిన పూర్తి బాధ్యత పాఠశాల విద్యాశాఖపైనే ఉంది.



జనగామ రైల్వే స్టేషన్ ఏరియాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎఫ్ఆర్ఎస్ ట్రయల్ చేస్తున్న ఉపాధ్యాయులు

పారదర్శకత పెరుగుతుంది..



పాఠశాలల్లో విద్యార్థులకు మాదిరిగా టీచర్లకు సైతం ఎఫ్ఆర్ఎస్ హాజరు శాతం అమలు చేయడం మంచి పరిణామం. దీంతో మరింత పారదర్శకత పెరుగుతు ంది. సాంకేతిక సమస్యలు తలెత్తకుండా పాఠశాల విద్యాశాఖ నిరంతరం పర్య వేక్షించాలి.

- రావుల రామ్మోహన్‌రెడ్డి, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

నేటి నుంచి రిజిస్ట్రేషన్లు



జిల్లాలో నేటి నుంచి ప్రభుత్వ బడుల్లో టీచర్లకు ఫేస్ రికగ్నైజేషన్ ఆధారిత హాజరు అమలు కానుంది. అయితే ముందుగా వారం రోజుల పాటు టీచర్లు ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసుకుంటారు. వంద శాతం యాప్‌లో వివరాలను నమోదు చేసిన వెంటనే ఎఫ్ఆర్ఎస్ అమల్లోకి వస్తుంది.

- భోజన్న, డీఈఓ, జనగామ

మహిళా సాధికారత కోసమే పథకాలు

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి
- మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



దేవరుప్పలలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్‌బాషా షేక్

దేవరుప్పుల: మహిళలు సాధికారత సాధించేందుకు ఇందిరా మహిళా శక్తి పథకాలు దోహదపడతాయని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద వారిద్దరు వనమహోత్సవంలో మొక్కలు నాటారు. అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా కామారెడ్డిగూడేనికి చెందిన జిల్లా మేఘన మహిళా సంఘం అధ్యక్షురాలు పులిపంపుల మమత స్వీయ ప్రేరణతో, మహిళా సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన వనిత మహిళా శక్తి క్యాంటీన్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ వసంత, ఏపీడీ నూరొద్దీన్, తహసీల్దార్ అండాలు, ఎంపీడీఓ సురేశ్‌కుమార్, విజయ డెయిరీ జిల్లా చైర్మన్ ధర్మారెడ్డి, ఐకేపీ డీపీఎం ప్రకాశ్, ఏపీఎం వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరాలయంలో పూజలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి, స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, ఆలయ అర్చకులు దేవగిరి లక్ష్మన్న, డీవీఆర్ శర్మ, దేవగిరి అనిల్‌కుమార్, మత్తగజం నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ల ప్రమోషన్ షెడ్యూల్ విడుదల

- జిల్లాలో 20 మంది ఎస్ఏలు, 100 మంది ఎస్జీటీలకు అవకాశం
- 10 రోజుల్లో ప్రక్రియ పూర్తి

జనగామ: రాష్ట్ర ప్రభుత్వం టీచర్ల ప్రమోషన్‌కు సంబంధించి గురువారం షెడ్యూల్ విడుదల చేసింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఆధ్వర్యంలో 10 రోజుల్లో ఈ ప్రక్రియను ముగించేలా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. ఈనెల 2 నుంచి 11 వరకు పదోన్నతి పొందుతున్న టీచర్లు కేటగిరీల వారికి ఆప్షన్లు ఎలా ఇవ్వాలనే దానిపై అందులో పేర్కొన్నారు. జిల్లాలో 1,283 మంది స్కూల్ అసిస్టెంట్లు(ఎస్ఏ), 890 మంది ఎస్జీటీలు ఉన్నారు. ఇందులో ఎస్ఏలు 20 మందికి గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, 100 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందనున్నారు. ఖాళీగా ఉన్న ఎస్జీటీ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. పదోన్నతులకు సంబంధించి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నేటి(శుక్రవారం) నుంచి పనులు ప్రారంభించనుంది.

షెడ్యూల్ ఇలా..

టీచర్ల పదోన్నతికి సంబంధించి ఈనెల 2న పీఎస్, ఉన్నత పాఠశాలల్లో గ్రేడ్–2 హెచ్ఎంలు, స్కూల్ అసిస్టెంట్ల ఖాళీలకు సంబంధించిన వివరాలను డీఈఓ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి. అలాగే.. పదోన్నతుల కోసం ఎస్ఏ, ఎస్జీటీల తాత్కాలిక సీనియార్టీ జాబితాను ప్రదర్శించాలి. 3న ఇరువురికి సంబంధించి అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. 4, 5వ తేదీన సీనియార్టీలపై అభ్యంతరాలను పరిష్కరించి, ఆర్జేడీ, డీఈవీ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలి. 6న గ్రేడ్–2 హెచ్ఎంల పదోన్నతి కోసం ఎస్ఏలకు వెబ్ ఆప్షన్ చేసుకునే అవకాశం కల్పించారు. 7వ తేదీన ఎస్ఏలకు గ్రేడ్–2 పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తారు. 8, 9వ తేదీల్లో పదోన్నతుల ఆర్డర్ వచ్చిన గ్రేడ్–2 హెచ్ఎం పేర్ల ప్రదర్శన, ఎస్జీటీల సీనియార్టీ జాబితాపై అభ్యంతరాల పరిష్కారం, సీనియార్టీ జాబితా ప్రకటన చేస్తారు. 10వ తేదీన ఎస్జీటీ వెబ్, ఎడిట్ ఆప్షన్, 11న కలెక్టర్ ఆదేశాల అనంతరం పదోన్నతి పొందిన టీచర్లకు ఉత్తర్వుల కాపీలను అందిస్తారు.

న్యూస్‌రీల్

లక్ష్య సాధనతో ముందుకు సాగాలి



తరిగొప్పుల: విద్యార్థులు లక్ష్య సాధనతో ముందుకు సాగాలని, క్రమశిక్షణతో మెలగాలని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) పింకేశ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మెనూ బోర్డును పరిశీలించి, మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ రోజు వందశాతం హాజరు నమోదయ్యేలా.. ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం డీఈఓ భోజన్నతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంఈఓ నెల్లుట్ల జానకి, ఎంపీడీఓ ఆలేటి దేవేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భాగ్యలక్ష్మి, పాఠశాల స్పెషల్ అధికారి సునీత తదితరులు పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు హర్షణీయమని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడు నెలలలోపే నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను సైతం ఆదేశించడం గొప్ప నిర్ణయమన్నారు కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హత విషయమై ద్వంద్వ వైఖరితో వ్యవహరించడం మానుకోవాలని హితవు పలికారు. సుప్రీం కోర్టు తీర్పుతో ప్రజాస్వామ్య పద్ధతులను గౌరవించాలని, వెంటనే పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ స్పీకర్ ప్రజాస్వామ్య విలువలను పరిరక్షిస్తూ పార్లమెంటరీ వ్యవస్థను గౌరవించేలా నిర్ణయం తీసుకుంటారని ఆశిస్తున్నట్లు స్పష్టం చేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



జనగామ రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఏవైనా ఇబ్బందులుంటే తెలియజేయాలని సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రమ్ అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ ఆదేశాల మేరకు ఆయన జిల్లా కేంద్రంలోని సబ్ జైలును గురువారం సందర్శించారు. జైల్లోని ఖైదీలను పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. న్యాయవాదులను నియమించుకోని ఖైదీలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు. ఖైదీల కోసం లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను కూడా జైల్లో ఏర్పాటు చేసినట్లు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం.రవీంద్ర అడ్వకేట్ దరఖాస్తులు రాసుకోవడానికి సహాయంగా పారా లీగల్ వలంటరీ బి.శేఖర్ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృష్ణకాంత్, వలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని బాల సదనాన్ని సందర్శించారు. బాలికలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. రిజిస్టర్లు పరిశీలించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



చిల్పూరు: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పల్లగుట్ట గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న జీడి ప్రీతి, పూర్వ విద్యార్థి కలకోల సంజు ఎంపికైనట్లు హెచ్ఎం పెనుమాటి వెంకటేశ్వర్లు, ఫిజికల్ డైరెక్టర్ దేవ్‌సింగ్ తెలిపారు. ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జూనియర్ ట్రాథలింగ్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఆగస్టు 3, 4 తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈసందర్భంగా గురువారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, శ్యాంసుందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రకాశ్, అలకనంద, శోభారాణి, రమణకుమార్ తదితరులు అభినందించారు.

ఆర్టీఐ బోర్డులు ఏర్పాటు చేయాలి



శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ రూరల్: ఆర్టీఐ దరఖాస్తుల సమాచారం అందించేందుకు ఉద్యోగులు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ కార్యాలయాల్లో తప్పనిసరిగా సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం ఆర్టీఐ చట్టంపై అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించారు. హనుమకొండ జిల్లా భూ గర్భ జల శాఖ పర్యవేక్షకుడు ధరంసింగ్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుహాసిని కలెక్టర్ కార్యాలయ ఏఓ శ్రీకాంత్ తదితరు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల రుణమాఫీకి ప్రతిపాదనలు

కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి చేనేత కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. జిల్లాలోని చేనేత కార్మికులు 2017 ఏప్రిల్ 1 నుంచి మార్చి 31, 2024 మధ్య కాలంలో చేనేత రుణాలు తీసుకున్న 442 కార్మికులకు సంబంధించి రూ.3,71,35,208లు మాఫీ చేసేందుకు కమిటీ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. రుణాలు చెల్లించిన 237 మంది కార్మికులకు సైతం మాఫీ చేసి ఖాతాల్లో జమ చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపామన్నారు. సమావేశంలో చేనేత జౌళి శాఖ ఆర్ డీడీ పద్మ, సహాయ సంచాలకులు శ్రీమతి చొడేశ్వరి వజీర్ సుల్తాన్, లీడ్ బ్యాంక్ మేనేజర్ మూర్తి, డిస్ట్రిక్ట్ ఆడిట్ ఆఫీసర్, జీఎం ఇండస్ట్రీస్ శివ కృష్ణ, ఠాకూర్ పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

దేవరుప్పుల: ఇంటర్ ప్రవేశానికి పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ షేక్ రిజ్వానా బాషా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలతోపాటు స్థానిక హైస్కూల్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సురేశ్‌కుమార్, ఎంఈఓ కళావతి, హెచ్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్

స్టేషన్‌ఘన్‌పూర్: ఉపాధ్యాయులకు సమయపాలన ఎంతో ప్రధానమని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి బి.శ్రీనివాస్ అన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధి ఛాగల్లు, స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి ప్రభుత్వ పాఠశాలల సముదాయాల సమావేశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులంతా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని వినియోగించుకోవాలని, నూతన బోధన పద్ధతులను మెరుగుపర్చుకునేందుకు కాంప్లెక్స్ సమావేశాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కొమురయ్య, కాంప్లెక్స్ హెచ్ఎంలు ఎం.సంపత్, కుసుమ రమేశ్, సెక్రటరీలు సోమనారాయణ, శ్రీధర్, ఎమ్మార్పీ సిబ్బంది గిరి, లవన్, శ్రీలత, జ్యోతి, వెంకటేశ్వర్లు, రమేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణకు ఇంటింటి సర్వే

- ఆర్డీఓ డీఎస్ వెంకన్న



మాట్లాడుతున్న ఆర్డీఓ డీఎస్ వెంకన్న

స్టేషన్‌ఘన్‌పూర్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు తదితర సవరణలు చేపట్టి తుది జాబితా కోసం త్వరలో ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు ఆర్డీఓ డీఎస్ వెంకన్న తెలిపారు. తెలంగాణ ఎన్నికల ప్రధానాధికారి సుదర్శన్‌రెడ్డి గురువారం చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్‌లో స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆర్డీఓతో పాటు వివిధ మండలాల తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు. వీసీలో అధికారులకు, ఎన్నికల సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడుతూ.. అసెంబ్లీ నియోజకవర్గాల ఓటరు జాబితాను తాజా పర్చుటకు ఇంటింటా సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఘన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వివిధ మండలాల తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది శ్రీప్రియ, మహిపాల్‌రెడ్డి, రాజకీయ పార్టీల నాయకులు తెల్లాకుల రామకృష్ణ, కె.శరత్‌కుమార్, జలగం ప్రవీణ్, తోట రమేశ్, సారయ్య పాల్గొన్నారు.

బంకులో అంకెల గారడీ

- పెట్రోల్ బంకులో నంబర్ల జంపింగ్
- తక్కువ వచ్చిందంటూ అధికారులకు వినియోగదారుల ఫిర్యాదు
- ఒక ఫ్యూయల్ డిస్పెన్సర్ సీజ్.. కలెక్టర్‌కు నివేదిక



బంక్ వద్ద పెట్రోలు తక్కువ వచ్చిందని చూపిస్తున్న వినియోగదారులు



ఫ్యూయల్ డిస్పెన్సర్‌ను తనిఖీ చేస్తున్న తూనికలు, కొలతల అధికారి శ్రీనివాస్

జనగామ: జనగామ పట్టణం సిద్దిపేట రోడ్డు జిల్లా ఆస్పత్రి ఏరియా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి భారత్ పెట్రోలియంలో పెట్రోలు తక్కువ వచ్చిన ఘటనపై కస్టమర్లు గురువారం ఆందోళనకు దిగారు. పట్టణానికి చెందిన చంద్రశేఖర్, అభిషేక్, ఉదయ్ తదితరులు 2.25 లీటర్ థమ్సప్ బాటిల్‌లో పెట్రోలు పోయించుకున్నారు. క్వాంటిటీ 2.33 లీటర్లంటూ బిల్లు జనరేట్ అయ్యింది. దీంతో తక్కువ క్వాంటిటీ పెట్రోల్‌కు ఎక్కువ బిల్లు వచ్చిందని బాధితులు నిర్వాహకులను నిలదీశారు. నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో బాధితులు వెంటనే తూనికలు, కొలతల జిల్లా అధికారి శ్రీనివాస్, జిల్లా పౌరసఫరాల శాఖ అధికారి సరస్వతీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారులు పెట్రోల్ బంకు వద్దకు వచ్చారు. ఫిర్యాదు చేసిన కస్టమర్లతో పాటు ప్రజల సమక్షంలో మున్సిపల్ రోడ్డు వైపు ఉన్న బంకులోని ఓ ఫ్యూయల్ డిస్పెన్సర్‌ను తనిఖీ చేశారు. అధికారుల సాక్షిగా ఆ పంపులో నంబర్స్ జంప్ అవుతున్న సంగతిని గమనించి.. పెట్రోల్ సైతం తక్కువగా రావడాన్ని గుర్తించారు. అలాగే బంకులోని ప్రతీ డిస్పెన్సర్‌కు ఉన్న అధికారిక సీల్, ఐదు లీటర్ల క్యాన్‌లో పెట్రోలు తీసి తనిఖీ చేశారు. వారం రోజుల నుంచి పంపు జంప్ అవుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని అక్కడున్న ప్రజలు మండిపడ్డారు. నిత్యం వందలాది మంది తమ వాహనాల్లో పెట్రోలు పోయించుకుని నష్టపోయారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెట్రోల్ బంక్‌ను సీజ్ చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం తూనికలు, కొలతల అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భారత్ పెట్రోలియంలోని ఓ ఫ్యూయల్ డిస్పెన్సర్‌లో నంబర్స్ జంప్ అవుతున్న విషయాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. వారం నుంచి జంప్ అవుతున్నట్లుగా కస్టమర్లు చెప్పారని, పూర్తి నివేదికను కలెక్టర్‌కు అందజేసినట్లు చెప్పారు. ప్రస్తుతం బంకులోని ఒక ఫ్యూయల్ డిస్పెన్సర్‌ను సీజ్ చేశామని, కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయన్నారు.

జిల్లాలో బంకుల నిర్వహణపై ఆందోళన

జిల్లాలోని పెట్రోల్ బంకుల నిర్వహణపై కస్టమర్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు బంకుల్లో పెట్రోలు తక్కువ రావడం, నీళ్లు రావడం, జంప్ సిస్టం తదితర వాటిపై ఫిర్యాదులు రాగా.. తనిఖీలు చేసిన విషయం తెలిసిందే. సంబంధిత అధికారులు పెట్రోల్ బంకులను తనిఖీ చేయకపోవడంతోనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయని కస్టమర్లు ఆరోపిస్తున్నారు. అధికారులు తరచూ తనిఖీలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.

శేష జీవితం ప్రశాంతంగా గడపాలి..

- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



రాజేందర్ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ తదితరులు

జనగామ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ సహజమని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఉద్యోగులు జీవితంలో ఎన్నో ఒడిదొడుకులతో ఆటుపోట్లను ఎదుర్కొంటూ విధులు నిర్వహిస్తారని, శేష జీవితం ప్రశాంతంగా గడపాలని కోరారు. జిల్లా సహకార శాఖ అధికారిగా సేవలందించిన రాజేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో కలెక్టర్ రిజ్వాన్ బాషా రాజేందర్‌రెడ్డి దంపతులను ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. తోటి ఉద్యోగులు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సహకార శాఖకు వన్నె తేవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్, డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో సీటి స్కాన్ సేవలు అందించాలి

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య

జనగామ రూరల్: జిల్లా ఆస్పత్రిలో సీటీ స్కాన్ సేవలందించి పేదలను ఆదుకోవాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. గురువారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఆస్పత్రిలోని సమస్యలపై సర్వే చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సిటీ స్కానింగ్ మిషన్ చెడిపోయి ఎనిమిదేళ్లు అవుతుందన్నారు. ప్రైవేట్ హాస్పిటల్ దందా సాగుతుందని, స్కానింగ్ తీయించుకుంటే రూ.2,500 ఖర్చవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. థైరాయిడ్ టెస్ట్ నెల రోజుల నుంచి చేయడం లేదన్నారు. షుగర్, హెచ్‌బీ ఏ వన్ సీ టెస్ట్‌లు చేయడం లేదన్నారు. కాంట్రాక్ట్ బ్యాచ్ సిస్టర్లు బాత్ రూమ్ వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని రూమ్‌లకు తాళాలు వేస్తున్నారని తెలిపారు. ప్రతీరోజు ఓపీ పేషెంట్లు 500 వరకు వస్తున్నారని సిటీ స్కానింగ్ ప్రారంభించి ప్రజలకు సేవలందించాలని కోరారు. కార్యక్రమంలో చింతల శ్రీలత, ఐద్వా పట్టణ అధ్యక్షురాలు బండ రమాదేవి, నాయకులు ఎండీ తబూసుం, సంపద విజయ, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- కలెక్టరేట్ వద్ద జీపీ కార్మికుల ధర్నా
- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రావర్తి రాజు

జనగామ రూరల్: ఏడు నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాపర్తి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆన్‌లైన్‌లో నమోదు కాని జీపీ కార్మికులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ సీహెచ్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి నారోజు రామచంద్రం కోశాధికారి బస్వ రామచంద్రం, కంబాలోజు రాజు, ఇట్టబోయిన మహేందర్ పగిడిపల్లి మల్లేశ్, ఉపేందర్, ఆంజనేయులు, సమ్మయ్య, ముత్యం, దేవి వినోద, మధు, మారపాక లక్ష్మి, ఆకారపు యాదమ్మ, బాల్నే రాధిక, బొంకూరి భారత తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

క్లుప్తంగా

వరంగల్ అబ్బాయి.. అమెరికా అమ్మాయి

- ఖండాంతరాలు దాటిన ప్రేమపెళ్లి



పెళ్లిలో దండలు మార్చుకుంటున్న దంపతులు

రామన్నపేట : వరంగల్ అబ్బాయి, అమెరికా అమ్మాయి ప్రేమ వివాహం గురువారం నగరంలోని వెంకటేశ్వర గార్డెన్‌లో ఇరుకుటుంబాల సమక్షంలో వైభవంగా జరిగింది. వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌కు చెందిన డాక్టర్ అశోక్, సునీత దంపతుల కుమారుడు రితేశ్, అమెరికాలోని పీట్స్‌బర్గ్‌కు చెందిన జూలియాన్ మనస్సులు కలవడంతో పెద్దలను ఒప్పించి బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కాగా, అమెరికా అమ్మాయి అయినా అచ్చ తెలుగు సంప్రదాయ పద్ధతిలో వివాహం జరగడంపై అతిథులు ఆనందం వ్యక్తం చేశారు.

డీఈఓకు సన్మానం



డీఈఓను సన్మానిస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణా, సీఎం సలహాదారు కేశవరావు

విద్యారణ్యపురి : న్యాస్ (పరాక్)లో హనుమకొండ జిల్లాను ఉత్తమస్థానంలో నిలిపినందున జూలై 30వ తేదీన హైదరాబాద్‌లో ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నిర్వహించిన జిల్లాల విద్యాశాఖాధికారుల సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారురు కె.కేశవరావు, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగి తారాణా.. డీఈఓ వాసంతిని సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

కేయూ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా హబీబుద్దీన్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ మహ్మద్ హబీబుద్దీన్ నియమితులయ్యారు. ఈమేరకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.రామచంద్రం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. ఫైనాన్స్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన తోట రాజయ్య ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఇన్‌చార్జ్ ఫైనాన్స్ ఆఫీసర్‌గా హబీబుద్దీన్‌కు బాధ్యతలు అప్పగించారు. హబీబుద్దీన్ కేయూలో 1988లో చిరు ఉద్యోగిగా చేరి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఉద్యోగం చేసుకుంటూనే సోషియాలజీలో డాక్టరేట్ పొందారు. నేడు (శుక్రవారం) రిజిస్ట్రార్ హబీబుద్దీన్ బాధ్యతలు స్వీకరించనున్నారు.

జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

కాజీపేట రూరల్: జిల్లాలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని జిల్లాకు చెందిన కేంద్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కడియం కావ్య, బలరాం నాయక్‌ను గురువారం కలిసి వినతి పత్రాలు అందజేశారు. గతేడాది కేంద్రం తెలుగు రాష్ట్రాల్లో తిరుపతి, వరంగల్‌కు రెండు వెల్‌నెస్ సెంటర్లు మంజూరైనట్లు తెలిపారు. ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ దృష్టికి తీసుకెళ్లి సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని కిషన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేత సదానందం తెలిపారు.

గమ్యంపై గురిపెడితే విజయం..

- విధుల్లో తెలంగాణ పోలీస్ దేశంలోనే బెస్ట్
- వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్ దోహదం
- 69 ఆలిండియా డ్యూటీ మీట్‌లో సత్తా చాటాలి
- తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్
- అట్టహాసంగా పోలీస్ డ్యూటీ మీట్–25 ప్రారంభం



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



జెండాను ఆవిష్కరిస్తున్న అభిలాష్ బిస్త్



మాట్లాడుతున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ ,అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, సీపీ సన్ ప్రీత్‌సింగ్

మామునూరు: ఏకాగ్రతతో గమ్యంపై గురిపెడితే విజయం సొంతమవుతుందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అన్నారు. పోలీస్ అధికారులు తమ వృత్తిలో నైపుణ్యం సాధించేందుకు డ్యూటీ మీట్‌లు ఎంతో దోహదపడుతాయని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో తెలంగాణ పోలీస్ దేశంలోనే బెస్ట్ అని కొనియాడారు. వరంగల్ మామునూరు పోలీస్ శిక్షణ కళాశాల పరేడ్ గ్రౌండ్‌లో వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో రెండో తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్–2025 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ ముఖ్య అతిథులుగా హాజరై డ్యూటీ మీట్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 450 మంది పైగా 18 టీమ్‌లు హాజరుకాగా.. పోలీసులు జెండాలు చేతబూని అతిథులకు గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ మాట్లాడుతూ నేర దర్యాప్తుతోపాటు అన్ని విభాగాల్లో దేశంలోనే తెలంగాణ మొదటి రెండు స్థానాల్లో నిలవడం హర్షణీయమన్నారు. 69వ ఆలిండియా డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం అభినందనీయం..

ఇటీవల జరిగిన 68వ జాతీయ స్థాయి డ్యూటీ మీట్‌లో తెలంగాణ పోలీసులు 18 పతకాలు సాధించడం అభినందనీయమని అడిషనల్ డీజీ మహేశ్ భగవత్ అన్నారు. జాతీయ స్థాయిలో సాధించిన విజయాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. అంతకు ముందు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్.. తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహణను వివరించారు.



డాగ్ నుంచి షేక్‌హ్యాండ్ తీసుకుంటున్న తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్

450 మందికిపైగా పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరు..

వరంగల్ మామునూరు పీటీసీలో గురువారం నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జరగనున్న పోలీస్ డ్యూటీ మీట్–2025 అట్టహాసంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని ఏడు జోన్లతోపాటు సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ కమిషనరేట్లు, సీఐడీ, ఇంటెలిజెన్స్, యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ వింగ్, జీ.ఆర్.పీ, ఐటీ అండ్ టీ, ఆక్టోపస్, గ్రేహౌండ్స్ విభాగాలకు చెందిన సుమారు 450 మందికిపైగా పోలీస్ అధికారులు, సిబ్బంది హాజరయ్యారు. సైంటిఫిక్ ఎయిడ్ ఇన్వెస్టిగేషన్, యాంటీ సబటేజ్ చెక్, కంప్యూటర్ అవేర్‌నెస్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీ, వీడియో గ్రఫీలకు సంబంధించి 25 విభాగాల్లో పోటీలు ప్రారంభమయ్యాయి. సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, ఎస్పీ రాంరెడ్డి, డీసీపీలు అంకిత్‌కుమార్, సలీమా, రాజమహేంద్రనాయక్, పీటీసీ ప్రిన్సిపాల్ ఇ.పూజ, కమాండెంట్లు రాంప్రకాశ్, రామకృష్ణ, అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్



మల్లన్నను దర్శించుకుంటున్న అభిలాష్ బిస్త్

ఐనవోలు: ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి వారిని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ దర్శించుకున్నారు. గురువారం తెలంగాణ పోలీస్ డ్యూటీ మీట్–2025 సందర్భంగా మామునూరు పీటీసీకి వచ్చిన ఆమె ఐనవోలు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టతను అర్చకుడు నరేశ్ శర్మ వివరించారు. వేదపండితులు వేదాశీర్వచనం చేయగా స్వామి వారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో అర్చకులు సన్మానించినట్లు ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ ప్రకాశ్, మామునూరు ఏసీపీ ఎస్. వెంకటేష్, పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ బి. రాజగోపాల్, ఎస్‌హెచ్ఓ శ్రీనివాస్, ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు మధుకర్ శర్మ, వేదపారాయణ దారులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్ జోషి, నరేశ్, మధు, శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ చేపట్టాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్



నయీంనగర్: పరిశీలిస్తున్న కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

రామన్నపేట : నగరంలోని ప్రజా మరుగుదొడ్ల నిర్వహణ పక్కాగా చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం హనుమకొండ ఏషియన్ షాపింగ్ మాల్ ప్రాంతంలోని డబుల్ బెడ్రూంలను, 35వ డివిజన్ వరంగల్ పుప్పాలగుట్ట వాటర్ ట్యాంక్ వద్ద శానిటేషన్ అండర్ డక్ట్ ప్రాంతం, చింతల్ బ్రిడ్జి వద్ద గల ప్రజా మరుగుదొడ్లను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా మరుగుదొడ్ల నిర్వహణ సమర్థవంతంగా చేపట్టేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పుప్పాల గుట్ట ప్రాంతంలో పర్యటించి సిబ్బంది ఫేస్ అటెండెన్స్‌ను పరిశీలించారు. పారిశుద్ధ్య సిబ్బందితో ఆమె మాట్లాడుతూ.. విధులు నిర్వహించే తీరుతోపాటు ఒక్కపూట భోజనం సరిపోతుందా..? రెండు పూటల అందించాలా..? అని అడిగి తెలుసుకున్నారు. శివనగర్‌లో అసంపూర్తిగా ఉన్న డక్ట్‌ను పరిశీలించిన కమిషనర్ వేగవంతంగా పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఎంహెచ్ఓ రాజేశ్, హెచ్ఓ లక్ష్మారెడ్డి, డీఈలు రాజ్‌కుమార్, రంగారావు పాల్గొన్నారు.

పరిశీలన..

నయీంనగర్: గ్రేటర్ పరిధిలోని ఉనికిచర్ల కుడా లేఔట్ స్థలం, స్పోర్ట్స్ స్టేడియం నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని గురువారం కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్.. అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె వెంట పీఓ అజిత్ రెడ్డి, ఈఈ భీంరావు, ఏపీఓ రామ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం వచ్చి అనంతలోకాలకు..

- ఆస్పత్రిలో రైతు మృతి
- డాక్టర్ నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన
- జనగామ జిల్లా కేంద్రంలో ఘటన



ఆస్పత్రి ఎదుట బాధితులతో మాట్లాడుతున్న పోలీసులు

జనగామ: వ్యవసాయ పొలంలో జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ రైతు వైద్యం కోసం వచ్చి ఆస్పత్రిలో మృతిచెందాడు. ఈ ఘటనకు వైద్యుడి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ మృతుడి కుటుంబీకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. గురువారం జనగామ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకుల కథనం ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బసంతాపురం గ్రామానికి చెందిన రైతు ఎం.ప్రభాకర్‌రెడ్డి (47) గత నెల 26వ తేదీన వ్యవసాయ పొలం దున్నుతున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగ తెగిపడడంతో ట్రాక్టర్ అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో ట్రాక్టర్ కేజీవీల్స్ అతడి రెండు కాళ్లపై వెళ్లడంతో వెంటనే జనగామలోని 'అజంతా' ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ బాలాజీ పరీక్షించి.. ప్రభాకర్ రెడ్డి కాలుకు ఇన్‌ఫెక్షన్ ఉందని, తగ్గే వరకు సర్జరీ వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. అనంతరం బుధవారం ఇంటికి తీసుకెళ్లాలని చెప్పగా పరిస్థితి విషమంగా ఉంటే ఎలా తీసుకెళ్లాలని కుటుంబీకులు సదరు వైద్యుడిని నిలదీయగా ఆస్పత్రిలోనే ఉండమన్నాడు. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజామున ప్రభాకర్‌రెడ్డి మృతిచెందాడు. దీంతో డాక్టర్ నిర్లక్ష్యంతోనే ప్రభాకర్‌రెడ్డి మృతి చెందాడని ఆరోపిస్తూ కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. కాలు ఇన్‌ఫెక్షన్‌కు గురైతే మరో ఆస్పత్రికి రెఫర్ చేయకుండా, ఐదు రోజులుగా ఆ ఆస్పత్రిలోనే ఉంచుకోవడంతోనే పరిస్థితి విషమించి ప్రభాకర్ రెడ్డి మృతి చెందాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కాగా, ఈ ఘటనపై డాక్టర్ బాలాజీ మాట్లాడుతూ పేషెంట్‌కు షుగర్, వీడీఆర్ఎల్ పాజిటివ్, ఇన్‌ఫెక్షన్, మోకాళ్ల వాపులు ఉండడంతో తగ్గే వరకు సర్జరీని వాయిదా వేసినట్లు చెప్పారు. అంతలోనే గుండెపోటుతో మృతి చెందాడని, ఇందులో తమ తప్పులేదని తెలిపారు.

నిద్రిస్తున్న ఆరేళ్ల బాలుడి మెడపై కత్తితో దాడి

- మెడభాగంలో కోసిన గుర్తుతెలియని వ్యక్తులు
- తీవ్రరక్తస్రావం అవుతుండటంతో ఆస్పత్రికి తరలింపు
- మహబూబాబాద్ జిల్లాలో ఘటన



కత్తి దాడిలో తీవ్రంగా గాయపడిన మనీష్



ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రిస్తున్న ఓ ఆరేళ్ల బాలుడి మెడపై గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో కోశారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఉపేందర్, శిరీష దంపతులకు మనీష్, మోక్షిత్ ఇద్దరు కుమారులున్నారు. ఉపేందర్ తన తల్లిదండ్రులైన ఎల్లయ్య, మంగమ్మతో కలిసి ఒకే ఇంట్లో ఉంటున్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి ఇంట్లో కుటుంబ సభ్యులు నిద్రిస్తుండగా, నానమ్మ (మంగమ్మ) పక్కన పడుకున్న మనీష్ అనే ఆరేళ్ల బాలుడి మెడకు ఒకవైపు, వీపుభాగంలో గురువారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో కోశారు. దీంతో ఆ బాలుడు ఏడుస్తుండగా నిద్రలేచిన మంగమ్మ తన మనుమడిని దగ్గరకు తీసుకుని చూసింది. మనీష్ మెడభాగంపై గాయమై తీవ్రంగా రక్తస్రావం అవుతుండటంతో కేకలు పెట్టింది. దీంతో కుటుంబ సభ్యులతోపాటు, చుట్టుపక్కలున్న వారు నిద్రలేచి మనీష్‌ను స్థానిక ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడినుంచి మానుకోట జనరల్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి మెడపై కత్తిగాటుతో పొడవుగా పడటంతో 8 కుట్లు పడ్డాయి. కాగా, ఇంటికి రెండు దర్వాజలు ఉండగా, ఒక దర్వాజ తలుపులకు బేడం లేదని, దీంతో ఇంట్లోకి ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి ఉంటారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రైనీ ఎస్సై నరేష్ సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. రూరల్ సీఐ సర్వయ్య మానుకోట జనరల్ ఆస్పత్రికి చేరుకుని విచారణ చేశారు. జరిగిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఉపేందర్, శిరీష దంపతుల చిన్నకుమారుడైన నిహన్ (యేడాదిన్నర బాలుడు) 7 నెలల క్రితం నీటిసంపులో పడి మృతిచెందాడు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలుడు మనీష్‌ను మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులకు సూచించారు.

రూ. 5లక్షల విలువైన గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్ట్, రిమాండ్.. మరొకరి పరారీ
- వివరాలు వెల్లడించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ అబ్బయ్య

తరిగొప్పుల: జనగామ జిల్లా తరిగొప్పుల మండలం అక్కరాజుపల్లి క్రాస్ వద్ద రూ. 5లక్షల విలువైన 10కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీఐ అబ్బయ్య తెలిపారు. ఈ మేరకు గురువారం తరిగొప్పుల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎస్సై శ్రీదేవి సిబ్బందితో కలిసి అక్కరాజుపల్లి క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశాలోని గంజాం జిల్లా సూర్య నాగ గౌరీ శంకర్ రోడ్డుకు చెందిన సంతోష్ పాండా, పున్నాత్ గ్రామానికి చెందిన శివరాం డాక్వా ఆటోలో అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో ఆటోను ఆపి తనిఖీ చేయగా రూ.5 లక్షల విలువైన 10 కిలోల గంజాయి లభించింది. కాగా, శివరాం డాక్వా పోలీసులను చూసి పారిపోగా సంతోష్ పాండాను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై కాసర్ల రాజయ్య,సిబ్బంది పాల్గొన్నారు.

డబ్బుల వసూళ్లకు పాల్పడిన వ్యక్తి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ మల్లేశ్

చిట్యాల: మావోయిస్టు ముసుగులో డబ్బుల వసూళ్లకు పాల్పడిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ మల్లేశ్ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన పల్లెపాటి గోపాల్‌రావు మద్యం, పేకాటకు బానిసయ్యాడు. అడ్డదారిలో డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో మావోయిస్టు పేరుతో ఓ లేఖను సృష్టించాడు. అనంతరం పది రోజుల క్రితం చిట్యాల మండలం శాంతినగర్ శివారులోని శ్రీ లక్ష్మీనర్సింహ రైస్ మిల్లు యజమాని శేఖరయ్యకు ఫోన్ చేసి మీతో మాట్లాడాలని చెప్పి మావోయిస్టు పార్టీ ఇచ్చినట్లు ఓ కవర్ అందించాడు. అందులో పార్టీ కోసం రూ.25 లక్షలు చందా రూపకంగా ఇవ్వాలని ఉంది. అలాగే, ప్రస్తుతం రూ. లక్ష ఇవ్వాలని, లేనిపక్షంలో చంపేస్తానని బెదించాడు. వారం రోజుల్లో రూ.25 వేలు ఇవ్వాలని, లేకపోతే చంపుతానని హెచ్చరించాడు. దీంతో రైస్‌మిల్లు యజమాని శేఖరయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి అప్రమత్తయ్యారు. ఈ క్రమంలో గురువారం డబ్బులు తీసుకోవడానికి వస్తున్న గోపాల్‌రావును కైలాపూర్ క్రాస్ వద్ద పోలీసులు ఆపి విచారించగా నిజం ఒప్పుకున్నాడు. దీంతో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. మావోయిస్టుల పేరుతో ఎవరైనా చందాల వసూళ్లకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శ్రావన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలి

- సీఐడీకి తెలంగాణ క్రికెట్ సంఘం ఫిర్యాదు



సీఐడీ కార్యాలయం వద్ద టీసీఏ బాధ్యులు

వరంగల్ స్పోర్ట్స్ : బీసీసీఐ నుంచి హెచ్‌సీఏ ద్వారా ఆయా జిల్లాలకు విడుదలయ్యే నిధుల వినియోగంపై విచారణ చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ వరంగల్ జిల్లా కార్యదర్శి తాళ్లపెల్లి జయపాల్ గురువారం సైబరాబాద్‌లోని సీఐడీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పది సంవత్సరాలుగా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పేరుతో రాష్ట్రంలోని జిల్లా సంఘాల ఖాతాల్లో రూ. 12 కోట్లు జమ చేశారని పేర్కొన్నారు. అందులో ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శులు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి విచారణ చేపట్టాలని సీఐడీ అధికారులను కోరారు.

హత్యాయత్నం కేసులో వ్యక్తికి ఐదేళ్ల జైలు, జరిమానా

దంతాలపల్లి: హత్యాయత్నం కేసులో నేరస్తుడికి ఐదేళ్ల జైలు, రూ.10వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు గురువారం తీర్పువెలువరించింది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన ఏరుకొండ నరేశ్ అదే గ్రామానికి చెందిన పోలోజు సునీతపై 2023 సంవత్సరంలో కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై సునీత కుమారుడు యాకాంబ్రం ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై జగదీశ్ కేసు నమోదు చేసి మహబూబాబాద్ జిల్లా కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. వాదోపవాదల అనంతరం నేరం రుజువు కావడంతో నేరస్తుడు నరేశ్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 10వేలు జరిమానా విధిస్తూ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి షాలిని షాకెల్లి తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. కాగా, నేరస్తుడికి శిక్ష పడేలా కృషి చేసిన పీపీ గణేశ్ ఆనంద్, ఎస్సై జగదీశ్, ఎస్సై రాజు, కోర్టు కానిస్టేబుల్ మంగీలాల్‌ను ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అభినందించారు.

'కాసం' ప్రజాపోరాటాలు చిరస్మరణీయం

- నేడు నీర్మాలలో కృష్ణమూర్తి వర్ధంతి



కాసం కృష్ణమూర్తి

దేవరుప్పుల : భూమి కోసం ..భుక్తి కోసం..బానిస బంధాల విముక్తి కోసం కొనసాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంగా కాసం కృష్ణమూర్తి చేపట్టిన ప్రజాపోరాటాలు చిరస్మరణీయం. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం నీర్మాలకు చెందిన కాసం కృష్ణమూర్తి గ్రామాల్లో భూస్వాములు, దేశ్‌ముఖ్‌ల పెత్తందారి వ్యవస్థపై ఎదురుదిరిగారు. తన తుదిశ్వాస వరకూ సీపీఎం అనుబంధ ఉమ్మడి రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడిగా అనేక వీరోచిత పోరాటాలు చేపట్టారు. కాసం వారసత్వాన్ని అందిపుచ్చుకునే క్రమంలో శుక్రవారం నీర్మాలలో ఆయన వర్ధంతి సభ నిర్వహించనున్నారు. ఈ సభను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఇంటి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఫ్యూడల్, రాచరిక పాలన, కులవివక్షకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించి దళాలుగా ఏర్పడి ఈ ప్రాంత భూస్వాములు, దేశ్‌ముఖ్‌లను తరిమిన మహావీరుడు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత కాసం కృష్ణమూర్తి అన్నారు. కార్యక్రమంలో నాయకులు పయ్యావుల భిక్షపతి, గడ్డం యాదగిరి, కున్సోత్ మాలు, రెడ్డిరాజుల నారాయణ, జాటోత్ శ్రీను నాయక్, గోడిశాల రాములు, కాసర్ల యాదిరెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

ట్రైనీ సర్వేయర్లకు న్యాయం చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఎస్ఎస్ అభ్యర్థులు

హన్మకొండ అర్బన్: ట్రైనీ లైసెన్స్‌డ్ సర్వేయర్ సిస్టమ్ (ఎల్ఎస్ఎస్)కు ఇటీవల నిర్వహించిన పరీక్షలో సమయానికి మించి ప్రశ్నాపత్రం ఉండడంతో తమకు అన్యాయం జరిగిందని ట్రైనీ ఎల్ఎస్ఎస్‌లు వాపోయారు. ఈ మేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ థియరీ ప్రశ్నాపత్రంలో ఇంగ్లిష్, తెలుగులో విభిన్నంగా ప్రశ్నలు రావడం, ప్రశ్నాపత్రాల్లో టోపో డిటెయిల్స్‌లో జరిగిన తప్పుల కారణంగా థియరీ ప్రశ్నాపత్రంలో సమాధానాలు రాయడానికి సమయం సరిపోలేదని పేర్కొన్నారు. తాలిమ్ (తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మేనేజ్‌మెంట్) మెటీరియల్ ప్రకారం 100 శాతం థియరీ – ప్రాక్టికల్స్‌ను జిల్లా శిక్షణ కేంద్రంలో అధికారులు, అధ్యాపకులు నేర్పించారని, అయినప్పటికీ ప్రశ్నలు మెటీరియల్ నుంచి ఇవ్వకుండా అన్యాయం చేశారని వాపోయారు. ఈ క్రమంలో మళ్లీ పరీక్షలు నిర్వహించాలని, జవాబు పత్రాలలో పేజీలను పెంచాలని, ప్లాటింగ్‌లో ప్రింటింగ్ క్లారిటీగా ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

సీఎం దిష్టిబొమ్మ దహనానికి యత్నం



దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలమయ్యారని ఏబీఎస్ఎఫ్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు కాకతీయ యూనివర్సిటీ మొదటి గేట్ వద్ద సీఎం దిష్టిబొమ్మ దహనానికి గురువారం యత్నించారు. కేయూ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది అక్కడికి చేరుకుని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇప్పటి వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ నాయకులు విజయ్, నందు, విష్ణు, పీటర్, శ్రీకాంత్, పవన్, అరవింద్, నవీన్, తరుణ్, గణేశ్, వంశీ, గోవింద్, సమ్మయ్య, సూర్యసాయి తదితరులు పాల్గొన్నారు.